APTEL/25/A2326

# ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం

పంపుటి : 1 సంచిక : 18 ఒంగోలు శనివారం 20-9-2025 ఎడిటర్ : కుమార్ పబ్లిషర్ : నరాల మురళి పేజీలు : 4 వెల : రూ. 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar



## రాజకీయ పార్టీలపై ఈసీ కొరడా

474 పొలిటికల్ పార్టీల గుర్తింపు రద్దు

చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న రాజకీయ పార్టీలపై ఈసీ కొరడా




**ఖన్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘించే రాజకీయ పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కఠిన చర్యలు చేపడుతోంది. తాజాగా గుర్తింపు పొందని 474 రాజకీయ పార్టీలను ఈసీ జాబితా నుంచి తొలగించింది. గత ఆరేళ్లలో (2019 నుంచి) ఒక్క ఎన్నికల్లోనూ బరిలోకి దిగని రాజకీయ పార్టీలపై ఈసీ వేటు వేసింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ వీటికి భౌతికంగా ఎలాంటి కార్యలయాలు లేవని వెల్లడించింది. ఇటీవలే 334 పార్టీలను రద్దు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పుడు మరో రౌండ్‌లో 474 పార్టీలను

మిగతా 2లో

## పాక్-సౌదీ రక్షణ ఒప్పందంపై భారత్ కీలక వ్యాఖ్యలు

మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రశ్నల వర్షం

పాక్-సౌదీ రక్షణ ఒప్పందంపై కాంగ్రెస్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** సౌదీ అరేబియా-పాకిస్థాన్ మధ్య కుదిరిన వ్యూహాత్మక రక్షణ ఒప్పందంపై భారత్ స్పందించింది. సౌదీ అరేబియా పరస్పర ప్రయోజనాలు, సున్నితత్వాలను గుర్తుంచుకుంటుందని భారత్ ఆశిస్తున్నామని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. మరోవైపు ఈ ఒప్పంద విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గుర్తు చేశారు. గత కొన్నేళ్లలో ఈ సంబంధం గణనీయంగా బలపడిందని

మిగతా 2లో

## ఈసీపై రాహుల్ గాంధీ కామెంట్స్



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ఓట్ల చోరీ అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత ఎన్నికల సంఘంపై దాడిని మరింత పెంచారు. ఈసీని ఎన్నికల కాపలాదారునిగా అభివర్ణించారు. తెల్లవారుజామున నిద్రలేచి ఓట్లచోరీకి పాల్పడుతున్నారని, దొంగలను రక్షిస్తుందని ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ఈ వ్యవహారానికి సంబంధించి 36సెకండ్ల నిడివి కలిగిన వీడియోను రాహుల్ పంచుకున్నారు. ఓట్లను చోరీకి పాల్పడుతున్న వారు తెల్లవారుజామున 4గంటలకు నిద్రలేచి, 36సెకండ్లలో ఇద్దరు ఓటర్లను తొలగించిన తర్వాత మళ్లీ నిద్రకు ఉపక్రమిస్తున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. వారిని ఓ క్రమపద్ధతిలో

మిగతా 2లో

## ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత

ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత




**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం ఉన్నా క్షేత్ర స్థాయిలో సరిగా అమలు కావడం లేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై శానససభలో జరిగిన చర్చలో పాల్గొన్న పవన్ కీలక అంశాలను ప్రస్తావించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి జరుగుతున్న నష్టంపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు పవన్ సమాధానం ఇచ్చారు. అసెంబ్లీలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్?ను పూర్తి స్థాయిలో కట్టడి చేయలేదన్నారు. ఫ్లెక్సీలను కూడా నిషేధించాలని, అయితే చాలా మందికి ఉపాధి పోతుందని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. బయోడీగ్రేడబుల్ ఫ్లెక్సీలను తయారు

మిగతా 2లో

# 2027కి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం

### సమర్థ నీటి నిర్వహణ అంశంపై అసెంబ్లీలో లఘు చర్చ

### భూగర్భ జలాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** రాష్ట్రంలోని ప్రజలందరికీ నీటి భద్రత కల్పించినప్పుడు అభివృద్ధి దానంతట అదే సాధ్యం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం నదుల అనుసంధానానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. భవిష్యత్తులో ఒక ప్రాంతంలో వరద వస్తే ఆ నీటిని మళ్లించి కరవుతో ఉన్న ప్రాంతం వాడుకునే పరిస్థితి తీసుకొస్తామని స్పష్టం చేశారు. విద్వేషాలకు తావివ్వకుండా దీనికి కలసి రావాలని పొరుగు రాష్ట్రాన్ని సీఎం కోరారు. అలాగే దేశంలో గంగా, కావేరీ నదులతోపాటు ఆయా రాష్ట్రాల్లో ఉన్న నదులన్నింటిని అనుసంధానం చేసిన రోజున భారత్ ప్రపంచానికే ఆహార ఉత్పత్తుల్ని ఎగుమతి చేసే పరిస్థితి వస్తుందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాష్ట్రంలో సమర్థ నీటి నిర్వహణ అంశంపై లఘు చర్చ నిర్వహించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చర్చను ప్రారంభించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం వారసత్వంగా ఇచ్చిన అప్పులు తీరుస్తూ పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రాజెక్టులను ఆయా ప్రాధాన్యతలను బట్టి పూర్తి చేస్తామన్న నిమ్మల అందుకు నిర్దిష్ట ప్రణాళిక పెట్టుకున్నట్లు వివరించారు. చర్చలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు సాగునీటి

మిగతా 2లో

## బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు


కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్







**కొండిపి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బహిరం గంగా మద్యం తాగితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు. కొండపి మండల పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రదేశాలను గుర్తించి పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలను భాగస్వామ్యులుగా చేసి కొండపి పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రేమ్ కుమార్ తన సిబ్బంది తో కలసి మద్యం సేవించే ప్రదేశాలను శుభ్ర పరిచి ఎవరు బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగరాదని,తాగిన ఎడల వారిపై చట్టపరమైనచర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అంకారావు, పోలీస్ , పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.




## విజయవాడ ఉత్సవ్'కు భారీ ఏర్పాట్లు

286 ఈవెంట్స్‌తో వరల్డ్ బిగ్గెస్ట్ ఫెస్టివల్ కార్నివాల్?

రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మైసూర్

తరహాలో విజయవాడ ఉత్సవ్ - సెప్టెంబర్ 22 నుంచి

అక్టోబర్ 2 వరకు 11 రోజులపాటు వేడుకలు

**విజయవాడ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** అంగరంగ వైభవంగా విజయవాడ ఉత్సవ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఉత్సవ్ ఉండాలని నిర్ణయించారు. 286 ఈవెంట్స్?తో వరల్డ్ బిగ్గెస్ట్ ఫెస్టివల్ కార్నివాల్?ని ప్రకటించారు. అగ్రి ఎక్స్ పో నుంచి కూచిపూడి, భరత నాట్యం,

మిగతా 2లో

## జర్నలిస్ట్ ఏడుకొండలుకు వైద్య సహాయం అందిస్తాం

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన జర్నలిస్టులు





**కనిగిరి, ప్రజలకు చేరువ :** మూడు రోజుల నుంచి ఆరోగ్య సమస్యతో బాధపడుతూన్న పెన్నా తీరం దినపత్రిక విలేకరీ ముప్పూరి ఏడుకొండలు గుంటూరులోని అమరావతి వైద్యాశాలలో గత మూడు రోజులుగా చికిత్సపొందుతున్నాడు. ఈ విషయం పలువురు పత్రిక విలేకర్లు కనిగిరి శ్యాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ద్రుష్టికి తుసుకెళ్లగా ఆయన ఫోన్ ద్వారా విషయం తెలుసుకొని సానుకూలంగా స్పందించారు. అతను కోలుకునేంతవరకు మెరుగైన వైద్య సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కనిగిరికి చెందిన పత్రికా విలేకర్లు ఎమ్మెల్యేఉగ్రాకు కృతజ్ఞతలు తెలుపారు.

# ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం

# సంపాదకీయం

## విద్యుత్ మాయాజాలం

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాలను జనం నెత్తిన మోపింది. కూటమి పార్టీలు, చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని మాట ఇచ్చారు. ప్రజలు నమ్మి గెలిపించారు. అధికారంలోకి వచ్చిన 9 నెలలలో చార్జీలు పెంచలేదని, రాబోయే నాలుగేళ్లు భారం వెయ్యబోమని చంద్రబాబు నమ్మబలుకుతున్నారు. ఇది పచ్చి అబద్ధం. గత తొమ్మిది నెలల్లో రెండు దఫాలుగా రూ.15,485 కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాన్ని మోపి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం 1998 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు పెట్టింది. విద్యుత్ సంస్థలను మూడు ముక్కలు చేశారు. ఉత్పత్తి రంగంలో ప్రైవేటు సంస్థలను దించారు. విద్యుత్ చార్జీలు చెల్లించిన సంవత్సరం లేదా ఐదు సంవత్సరాల తర్వాత లెక్కలు చూసి, ఆదాయం కంటే ఖర్చులు పెరిగితే ఆ తేడాని జనం నుండే వసూలు చేసే సర్దుబాటు చార్జీల విధానాన్ని ఆనాడు ప్రవేశపెట్టారు. వాటినే ట్రూ అప్, ఆ తర్వాత సర్దుబాటు చార్జీలు (ఫ్యూయల్ పవర్ పర్చేజింగ్ కాస్ట్ ఎడ్జస్ట్‌మెంట్-ఎఫ్.పి.పి.సి.ఎ)గా పిలుస్తున్నారు. ఈ సర్దుబాటు చార్జీలను ఐదు సంవత్సరాలకు ఒకసారి, సంవత్సరానికి ఒకసారి లెక్కించి ఆ భారం మొత్తాన్ని నెల నెలా బిల్లులలో కలిపి వసూలు చేస్తున్నారు. ఈ సర్దుబాటు చార్జీల విధానమే ప్రమాదం. ప్రతి ఒక్కరి నెల విద్యుత్ బిల్లులు పరిశీలిస్తే కూటమి ప్రభుత్వ బండారం బట్టబయలవుతుంది. బిల్లులలో నెలసరి వాడుకున్న విద్యుత్ యూనిట్లు, దానిపై వసూలు చేస్తున్న ఎనర్జీ చార్జీలు ఉంటాయి. నివాసాలకు యూనిట్ రూ.1.90 పైసల నుండి స్లాబు ప్రకారం పది రూపాయల వరకు వసూలు చేస్తారు. నివాసం కాని షాపులు, ఇతర సంస్థలకు అధిక స్లాబులు ఉంటాయి. ఈ చార్జీలలో పెద్ద మార్పులు లేవు. కానీ బిల్లులు మాత్రం పెరుగుతున్నాయి. ఇందులోనే మోసం ఉంది. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువగా ఉంటున్నాయి. ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఆలస్యమైందనే సాకుతో రూ.25 సర్ చార్జీలు, ఇంకా ఆలస్యమైతే కనెక్షన్ తొలగించినట్లు రాసుకొని మళ్లీ రీకనెక్షన్ చార్జీలు%ఇవన్నీ వసూలు చేస్తున్నారు. మరోవైపు గత 32 నెలల నుండి 2014-19లో వినియోగించుకున్న విద్యుత్‌పై ట్రూ అప్ చార్జీలు వసూలు చేస్తున్నారు. మరో 4 నెలలు అవి కొనసాగుతాయి. ఇవి కాకుండా 2022-23, 2023-24 సంవత్సరాల్లో కట్టిన బిల్లులపై మళ్ళీ అదనంగా సర్దుబాటు చార్జీలు (ఎఫ్.పి.పి.సి.ఎ) కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అదనంగా వేశారు. అది బిల్లుల్లో కలుపుతున్నారు. 2026 నవంబర్ వరకు ఇవి కొనసాగుతాయి. ప్రతి నెలా గత నెలలో వాడిన కరెంటుపై యూనిట్‌కి 40 పైసలు చొప్పున మరుసటి నెలలో మరొక సర్దుబాటు చార్జీ వసూలు చేస్తున్నారు. దీనికి తోడు విద్యుత్ సుంకం (ఎలక్ట్రిసిటీ డ్యూటీ) వసూలు చేసి ప్రభుత్వం ఖజానా నింపుకుంటున్నది. ఒక్కొక్క యూనిట్‌కి ఆరు పైసలు వసూలు చేస్తున్నారు. నివాసం కాకుండా చిన్నా చితక వ్యాపారాలేగాక పెద్ద సంస్థలకు కూడా ఇప్పటి దాకా వసూలు చేస్తున్న యూనిట్‌కు 6 పైసలను ఒకేసారి 100 పైసలకు సుంకం పెంచారు. వైసిపి ప్రభుత్వం ఈ రకంగా పెంచితే కోర్టు నిలుపుదల చేసింది. కూటమి ప్రభుత్వం చట్ట సవరణ చేసి 100 పైసలు వసూలు చేయటానికి చట్టబద్ధత కల్పించింది. అంటే విద్యుత్ సుంకం ఒకే సారి 15 రెట్లు (1566 శాతం) పెంచింది. వేల కోట్లు దండుకుంటున్నది. ఇదే కాకుండా ప్రతి ఇంటిలో తనిఖీలు చేసి ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, ఇతర గృహోపకరణాలు అదనంగా ఉన్నాయని సాకు చెప్పి అదనపు లోడ్ పేరుతో వేల రూపాయలు జనం నెత్తిన అదనపు లోడ్ చార్జీలు వసూలు చేయటం నిత్యకృత్యంగా మారింది. దానికి ఇప్పుడు రాయితీ ప్రకటించి, స్వచ్ఛందంగా మీరే వెళ్లి దరఖాస్తు పెట్టుకుని 50 శాతం కడితే చాలని ఇంకొక నాటకానికి ప్రభుత్వం తెరదీసింది.

(మొదటి పేజీ తరువాయి)

## ఈసీ కొరడా

గుర్తించి వేటు వేసింది. గత రెండు నెలల వ్యవధిలో 808 రాజకీయ పార్టీలను ఈసీ రద్దు చేసింది. ఇప్పటి వరకు 2,520 గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలు ఉండగా, తాజా తొలగింపుతో ఆ సంఖ్య 2,046కు చేరుకుంది. దేశంలో ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు, 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ఈసీ తెలిపింది. రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మార్గదర్శకాల ప్రకారం, ఒక పార్టీ వరుసగా 6 సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేయకపోతే, దానిని రిజిస్టర్డ్? పార్టీల జాబితా నుంచి తొలగిస్తారు. గత రెండు నెలల్లో ఈసీ రద్దు చేసిన పార్టీల్లో 14 బిహార్‌కు చెందినవి కావడం గమనార్హం. బిహార్?లో త్వరలో ఎన్నికలు జరగనున్న వేళ 14 పార్టీలపై వేటు పడడం విశేషం.

**నిబంధనల ఉల్లంఘనలు :** 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో కొన్ని పార్టీలు, నిర్ణీత వ్యవధిలోపు తమ వార్షిక ఆడిట్? ఖాతాలను సమర్పించలేదు. మరికొన్ని ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ, ఎన్నికల ఖర్చులను నివేదకలను దాఖలు చేయలేదు. ఇలాంటి పార్టీలు 359 వరకు ఉన్నాయి. ఇవి 23 రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవి. 2001 నుంచి ఈసీ మూడు నుంచి నాలుగు సార్లు ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలను రాజకీయ పార్టీల జాబితా నుంచి తొలగించే ప్రక్రియ ప్రారంభించింది. అయితే చట్టప్రకారం ఇలా పార్టీలను రద్దు నిర్దేశం ఏదీ లేకపోవడంతో, గతంలో సుప్రీంకోర్టు పార్టీల గుర్తింపు తొలగించకుండా పోల్ ప్యానెల్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీనితో ఈసీ పార్టీలను తొలగించే మార్గాన్ని కనుగొంది. మన దేశంలోని రాజకీయ పార్టీలు (జాతీయ, రాష్ట్ర, రిజిస్టర్డ్ అన్?రికగ్నైజ్డ్? పొలిటికల్ పార్టీలు) 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 39ఏ నిబంధనల ప్రకారం ఈసీ వద్ద నమోదు చేయబడతాయి. ఈ నిబంధన ప్రకారం, ఒకసారి రాజకీయ పార్టీగా నమోదు చేసుకున్న అసోసియేషన్ కొన్ని పన్ను మినహాయింపులు, ప్రత్యేక హక్కులు, ప్రయోజనాలను పొందుతాయి. రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయడం, 2019 నుంచి లోక్?సభ, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల శాసన సభలకు లేదా ఉపఎన్నికల్లో పోటీ చేయని పార్టీలను, గుర్తింపు లేని పార్టీలను పొలిటికల్ పార్టీల జాబితా నుంచి తొలగించడమే లక్ష్యంగా ఈ కసరత్తు నిర్వహించినట్లు ఈసీ అధికారులు తెలిపారు. అయితే బిహార్ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్రంలోని 14 పార్టీల గుర్తింపు రద్దు చేసింది. దీని వల్ల ఆ పార్టీలు తమ అభ్యర్థులను ఎలక్షన్‌లో నిలబెట్టలేవు.ం

## భారత్ కీలక వ్యాఖ్యలు

తెలిపారు. సౌదీ అరేబియా పరస్పర ప్రయోజనాలు, సున్నితత్వాలను గుర్తుంచుకుంటుందని ఆశిస్తున్నామని విలేకర్ల సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

**మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రశ్నల వర్షం :** ప్రధాని మోదీకి ప్రచారంపై ఉన్న మక్కువ వల్లే భారత్‌ను ఇరుకున పడిందిని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఉగ్రవాద విషయంలో పాకిస్థాన్‌ను ఒంటరిగా చేయడానికి బదులు ప్రధాని మోదీ కొత్త రక్షణ గొడుగును పొందేందుకు అనుమతించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాందీప్ సుర్జేవాలా అన్నారు. 'ఇది రాజకీయాల విషయం కాదు, జాతీయ ప్రయోజనాల అంశం. దేశ భద్రతను మూలకుపోయే విదేశాంగ వైఫల్యాలను భారతదేశం సహించలేం. భారత్‌కు సౌదీ రెండువ అతిపెద్ద వ్యాపార భాగస్వామిగా ఉంది. మోదీ ప్రభుత్వం పాక్‌ను ఒంటరిపరచడం బదులు, దానికి కొత్త రక్షణ గొడుగును సమకూర్చే అవకాశం కల్పించింది. మళ్లీ పాక్ నుంచి ఉగ్రవాద దాడి జరిగితే, సౌదీ అరేబియా భారత్ పక్షాన నిలుస్తుందా? లేక ఒప్పందం ప్రకారం పాక్‌కు సహకరిస్తుందా? భారత ప్రయోజనాలను కాపాడకుండా, ఒక కీలక గల్ఫ్ భాగస్వామి ఇస్లామాబాద్ వైపు ఎందుకు మళ్లిపోయింది? ప్రధాని మోదీ భారత్ గ్లోబల్ స్థాయిని పెంచుతున్నారని చెబుతారు. కానీ ఆయనకే అత్యున్నత పౌర పురస్కారాలు అందజేసిన దేశాలు పాక్?తో రక్షణ ఒప్పందాలు చేసుకోవడం ఏం సంకేతం?' అని ప్రశ్నల వర్షం కురిపించారు.

**ఒప్పందంలోకి మరిన్ని దేశాలు! :** మరోవైపు సౌదీతో తమ దేశం కుదుర్చుకున్న రక్షణ ఒప్పందంలోకి మరిన్ని దేశాలు చేరే అవకాశం ఉందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వెల్లడించారు. ఇందుకు గల అవకాశాలను తాము మూసివేయలేదని తెలిపారు. అరబ్ దేశాలు కూడా ఈ డీల్ భాగం అవుతాయా? అని జియోన్యూస్ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు స్పందించారు. తాజాగా సౌదీతో చేసుకొన్న ఒప్పందంలో మూడో దేశం చేరకుండా లేదా మరో దేశంతో ఇలాంటి అగ్రిమెంట్ చేసుకోకూడదని ఎటువంటి క్లాజు లేదని ఆసిఫ్ పేర్కొన్నారు. ఈ ఒప్పందం కింద అణ్వాయుధాలు వాడకూడదన్న నిబంధనేమీ లేదని తెలిపారు. తమకు ఉన్న అన్ని సామర్థ్యాలను వినియోగిస్తామని అన్నారు. తమ దేశం అణ్వాయుధ తనిఖీలకు ఎప్పుడూ సహకరిస్తుందని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడదని చెప్పారు. అయితే ఇది కేవలం రక్షణాత్మక ఒప్పందం మాత్రమే అని పేర్కొన్నారు.

**అసలేంటీ ఒప్పందం :** పాకిస్థాన్-సౌదీ అరేబియా మధ్య ఇటీవలే ఓ రక్షణ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం ఇరువురిలో ఏ దేశంపై దాడి జరిగినా రెండింటిపై దాడిగా భావించి ఎదుర్కొంటారు. కొన్ని నెలల క్రితం భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పహల్గాం ఉగ్రదాడి బదులుగా మన బలగాలు పాక్‌లోని ఉగ్రమూకలను మట్టుపెట్టాయి. దాని తర్వాత రెండు దేశాల మధ్య కొన్నిరోజుల పాటు ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఒప్పందం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఈసీపై రాహుల్ గాంధీ కామెంట్స్

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికలసంఘం ఓట్లచోరీకి పాల్పడినవారిని కాపాడటం ఆపాలని, ఓట్లచోరీపై దర్యాప్తు చేస్తున్న కర్ణాటక సీఐడీ కోరిన సమాచారాన్ని వారంలోపు అందించాలని శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా విమర్శించారు. 'రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ వరుసగా ఎన్నికల్లో ఓడిపోయింది. దీనిని రాహుల్ గాంధీ అంగీకరించాలి. యువత ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ మద్దతు ఇస్తోంది. ఎన్నికల్లో వరుస పరాజయాల తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థనే రాహుల్ దూషిస్తున్నారు. దేశం రాహుల్ గాంధీని నమ్మదు. పేదలు, రైతులు, సామాన్యులు ప్రధాని మోదీని తమ నాయకుడిగా చూస్తున్నారు. ఓటమి తర్వాత తన బలహీనతలు దాచుకోవడానికి రాహుల్ వ్యవస్థపై నిందలు వేస్తే, దేశం దానిని అంగీకరించదు. మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి చెందుతోంది. రాహుల్ గాంధీ వంటి వారు భారత్‌ను ముందుకు నడిపిస్తున్న ఇంజన్‌ను ఆపాలని చూస్తున్నారు అని కిరణ్ రిజిజు ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, గుర్తుతెలియని వ్యక్తులు సాఫ్ట్‌వేర్ ద్వారా వ్యవస్థీకృతంగా వివిధ రాష్ట్రాల్లో తమ ఇష్టానుసారం ఓటర్ల జాబితాల్లో మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలోని అలంద్, మహారాష్ట్రలోని రజోరా అసెంబ్లీ నియోజకవర్గాలే దీనికి ఉదాహరణ అని తెలిపారు. బయటి రాష్ట్రాల ఫోన్లను ఉపయోగించి అలంద్‌లో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అగంతకులు 6,018 ఓట్లను తొలగిస్తే, అదే విధానంలో మహారాష్ట్రలోని రజోరా నియోజకవర్గంలో 6,850 మంది కొత్త ఓటర్లను చేర్చారని వెల్లడించారు. ఈ క్రమంలో పలువురి పేర్లు, వారికి సంబంధించిన వివరాలను ఆయన మీడియా ముందు వెల్లడించారు.

## ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత

చేయాలని ప్రజలకు సూచించారు. మనుషుల రక్తంలో, జంతువుల పాలల్లో కూడా ప్లాస్టిక్ అవశేషాలు ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని పవన్ అభిప్రాయపడ్డారు. ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యతని పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన అవసరమన్న పవన్, పారిశ్రామికవేత్తలు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నిధులు కూడా అవసరమన్న ఉపముఖ్యమంత్రి, ప్రజల్లో అవగాహన రావాలంటే ఏం చేయాలనే అంశంపై కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. తమ శాఖ ద్వారా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించేలా మూడు నెలల్లో కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. ప్రజలంతా కలిసి వచ్చినప్పుడే నిషేధం సాధ్యమని స్పష్టం చేశారు. "ఆవుల కడుపులో సుమారు 70 కిలోల ప్లాస్టిక్ తొలగించిన ఘటనలు నమోదయ్యాయి. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి చాలా ఏళ్లు పడుతుంది. ప్లాస్టిక్ పూర్తిగా భూమిలో కలిసిపోవట్లేదు. చిన్నచిన్న ముక్కలుగా విడిపోయి అలానే ఉండిపోతుంది. వీటన్నింటికి సంబంధించి 2, 3 నెలల్లో కార్యాచరణ ప్రణాళిక తయారుచేస్తాం. ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు తిరుమలలో చాలా ప్రయత్నం చేస్తున్నారు. తిరుమలలో లక్షలాదిమంది భక్తులు క్రమశిక్షణతో వ్యవహరిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. కాలుష్య పరిశ్రమలపై చర్యలకు డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ కాలుష్యం పేరుతో పరిశ్రమ మూసి వేస్తే వేలాది మంది ఉద్యోగులు రోడ్లపై పడతారని తెలిపారు. తప్పు చేసినట్లు తేలితే చర్యలు ఉంటాయని, రాంకీ సంస్థపై చర్యలు తీసుకున్న విషయం ప్రస్తావించారు. కాలుష్య నియంత్రణ మండలికి ప్రత్యేకంగా ఉద్యోగులు లేరని, స్థానిక సంస్థలతో కలిసి మాత్రమే వారు సమన్వయం చేసుకుని పని చేస్తారని వివరించారు. ఉప్పలపాడు పక్షుల కేంద్రం విషయంలోనూ చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్? అన్నారు. గత ప్రభుత్వం కాలుష్య నియంత్రణ బోర్డులో ఎవరినీ నియమించలేదన్న పవన్, పొల్యూషన్ అనేది స్థానిక సంస్థలతో సంబంధం ఉన్న విషయమని పేర్కొన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ప్రత్యేకంగా ఉద్యోగులు లేరని, రాంకీ సంస్థకు షోకాజ్ నోటీసు ఇచ్చి చర్యలు తీసుకున్నామని తెలిపారు. వెంటనే చర్యలంటే ఎన్ని పరిశ్రమలు మూతపడిపోతాయో అలోచించాలని, పరిశ్రమలు ఆపేసుకుంటూ పోతే చాలా కుటుంబాలు రోడ్డుపై పడతాయని వ్యాఖ్యానించారు. పొల్యూషన్ లేకుండా ఏ పరిశ్రమా లేదన్న పవన్‌కల్యాణ్, కాలుష్య నియంత్రణ పరిశ్రమలు, ప్రజలు, అధికారుల బాధ్యత అని అన్నారు. అందరూ బాధ్యత తీసుకునేలా చర్యలు ఉండాలని, పారిశ్రామికవేత్తలను భయపెట్టడం తమ ఉద్దేశం కాదని తెలిపారు. పొల్యూషన్ వల్ల మాస్కులు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వస్తాయని, అందుకే తానే వెళ్లి దీనిపై ఓ నివేదిక అందజేస్తానని పేర్కొన్నారు.

## అంకితం చేస్తాం

ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**10 ప్రణాళికల్లో నీరు ఒకటి :** తర్వాత చర్చకు సమాధానమిచ్చిన సీఎం చంద్రబాబు తమ ప్రభుత్వం నిర్దేశించుకున్న మొదటి 10 ప్రణాళికల్లో నీరు ఒకటని స్పష్టం చేశారు. అందుకే నీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో 94 శాతం నీటి నిల్వ ఉందన్న ముఖ్యమంత్రి ఇప్పటికీ చాలా నీరు సముద్రంలోకి వృధాగా పోతుందని అన్నారు. అందుకే తాము నదుల అనుసంధానాన్ని చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్సీపీ హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన సీఎం ఆయా ప్రాజెక్టుల్ని నిర్దిష్ట గడువుతో ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తామని తెలిపారు.

2027 డిసెంబర్‌లోగా పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను సైతం చెప్పిన మాట ప్రకారం పూర్తి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టిసీమతో పాటు పోలవరం, వెలిగొండ, హంద్రీనీవాపై గతంలో జగన్ చేసిన వ్యాఖ్యలను ప్రదర్శించారు. అదే సమయంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉండగా చేపట్టిన పనులతో పాటు ప్రస్తుతం సాగుతున్న పోలవరం పనులు, సుదీర్ఘ తీరం ప్రయాణించి చిత్తూరు జిల్లా పరమసముద్రం చేరిన కృష్ణా జలాలు, వాటికి ఇస్తున్న జల హారతిని సైతం ప్రదర్శించారు.

నదులు అనుసంధానం చేస్తేనే నాకు సంతోషం: కుప్పానికి కృష్ణా జలాల్ని తీసుకెళ్లడం తన పూర్వ జన్మ సుకృతమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తాను ఎన్ని అభివృద్ధి పనులు చేసినా ప్రాజెక్టులు కట్టి నదుల అనుసంధానం చేస్తేనే తనకు అత్యంత సంతోషాన్ని ఇస్తుందని చెప్పారు. ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంచడం ద్వారా కర్ణాటక 150 టీఎంసీలు, 16 పథకాల ద్వారా తెలంగాణ 130 టీఎంసీలు తీసుకెళ్లాలని ప్రణాళికలు వేస్తున్నాయన్న సోమిరెడ్డి ఈ వినియోగం పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వానికి సూచించారు.

## భారీ ఏర్పాట్లు

డ్రోన్స్ షో ఇలా ఒకటేమి అన్నీ కంటికి కనువిందు చేయనున్నాయి. ఆహార ప్రియులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక స్టాల్స్ పెడుతున్నారు. దసరా ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇక్కడ ఉండే విశేషాలను చూయిస్తూనే, పర్యాటకాన్ని ప్రమోట్ చేయనున్నారు.

**11 రోజుల పాటు వేడుకలు :** దసరా పండుగ సందర్భంగా విజయవాడ ఉత్సవ్ సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనుంది. ఈ 11 రోజుల వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు శర వేగంగా సాగుతున్నాయి. కృష్ణా నది తీర ప్రాంతంలోని పున్నమీ ఘాట్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, గొల్లపూడిలోని ఎగ్జిబిషన్ మైదానం, ఘంటసాల సంగీత కళాశాల ఇలా మొత్తం ప్రాంతాలను ఈ వేడుకల కోసం ఎంపిక చేశారు. సినీ, సంగీత, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు. విజయవాడను పర్యాటకంగా, సాంస్కృతిక కేంద్రంగా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ ఉత్సవాలు పెడుతున్నారు.

**అక్కడ 12 ఏళ్ల క్రితం ఎగ్జిబిషన్లు :** ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కార్యక్రమాలతోపాటు వినోదాలను పంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నాలుగు వేదికల్లో షోలు, స్టాళ్లు నగరవాసులను దుర్గమ్మ దర్శణానికి వచ్చే భక్తులను అలరించనున్నాయి. విజయవాడ వైభవాన్ని చూపించేలా ఈ వేడుకలు ఉంటాయని నిర్వహకులు చెబుతున్నారు. బెజవాడలో 12 ఏళ్ల క్రితం ఎగ్జిబిషన్లు ఉండేవి. ఆ తర్వాత పలు కారణాలతో వాటిని నిర్వహణ ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ వై బ్రెంట్ విజయవాడ సొసైటీ ఏర్పడి ఈ వేడుకలు జరగుతున్నాయి. నాలుగు ప్రాంతాల్లో విజయవాడ ఉత్సవ్ పెడుతున్నా గొల్లపూడిలోని ఎగ్జిబిషన్ అతిపెద్దది. మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న 40 ఎకరాల స్థలంలో ఇక్కడ కిడ్స్, అగ్రికల్చర్, డ్వాక్రా, టూరిజం, లైవ్ కాన్సర్ట్స్ ఉంటాయి.

**ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకమైన డ్రోన్ షో :** అత్యంత భారీ స్థాయిలో విజయవాడ ఉత్సవ్ నిర్వహించేందుకు సొసైటీ ఫర్ వెబ్రెంట్ విజయవాడ శ్రేయాస్ మీడియాతో చేతులు కలిపింది. వారితో కలిసి ఈవెంట్లు చేస్తున్నారు. రెండు నెలల నుంచే స్థానిక ఎంపీ కేశినేని శివానాథ్ ఈ వేడుకలపై కసరత్తు ప్రారంభించారు. శ్రేయాస్ మీడియాతో చర్చించి ఈవెంట్స్ ఎలా పెట్టాలనే దానిపై నిర్ణయం తీసుకున్నారు. పున్నమి ఘాట్?లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయి. అక్కడే 11 రోజులపాటు ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకమైన డ్రోన్ షో జరపనున్నారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు ప్రత్యేకమైన ఆహారపు స్టాళ్ల ఏర్పాటు జరగుతోంది. 650 నుంచి 700 స్టాల్స్ వస్తున్నాయి. గొల్లపూడిలో అగ్రి ఫెవిలీయన్ మొట్ట మ్నెదటి సారి పెడుతున్నారు. ఈ ప్రాంతంలో అన్నదాతలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అంటున్నారు. మరో ఆకట్టుకునే అంశం 70 అడుగుల ఈఫిల్ టవర్ పెడుతున్నారు. అంతే కాకుండా మరికొన్ని నెలల్లో రిలీజ్ అయ్యే సినిమాల ఈవెంట్లు ఇక్కడే పెడుతున్నారు. మైసూరు తరహాలో విజయవాడ ఉత్సవ్ ఉంటుందని నిర్వహకలు చెబుతున్నారు. 286 ఈవెంట్స్ పెడుతున్నట్లు చెప్పిన శ్రేయాస్ మీడియా ప్రతినిధులు అందుకే దీన్ని వరల్డ్ బిగ్గెస్ట్ ఫెస్టివ్ కార్నివాల్ అని నామకరణం చేశామన్నారు.

**పర్యాటక శాఖకు పారిశ్రామికంగా హోదా :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పర్యాటక శాఖకు పారిశ్రామికంగా హోదా కల్పించారు. అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని పలు సందర్భాల్లో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో పోల్చితే ఆకర్షనీయమైన పర్యాటక ప్రాంతాలు బెజవాడ పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. హైదరాబాద్ - విజయవాడ హైవేకు దగ్గర్లోనే ఫెర్రీ ఘాట్, ప్రసిద్ధి చెందిన కొండపల్లి ఖిల్లా, మూలపాడు నగరం ఉన్నాయి. కొండపల్లి ఖిల్లా, మూలపాడు పార్కు, బెరంపార్కు, భవానీ ఐలాండ్ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే వారికి ఈ ప్రాంతాన్ని టూరిస్టు ప్లేస్‌గా చూపించబోతున్నారు.

### ఆపరేషన్ సింధూర్

## భారత్ దెబ్బ నిజం

### లష్కర్ ఉగ్రవాది అంగీకరించిన నిజం




**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :**

పాకిస్థాన్ గడ్డపై భారత్ జరిపిన "ఆపరేషన్ సిందూర్" సంచలనం సృష్టిస్తోంది. ఈ ఆపరేషన్‌లో భారత్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిందన్న నిజం ఇప్పుడు బహిర్గతమైంది. లష్కరే తయ్యిబా టాప్ కమాండర్ ఖాసిమ్ స్వయంగా ఈ విషయాన్ని అంగీకరించడంతో పాకిస్థాన్ ప్రచారం చేసినవన్నీ అబద్ధాలని తేలింది. లష్కరే కమాండర్ల అంగీకారం వైరల్ అయిన ఒక వీడియోలో లష్కరే టాప్ కమాండర్ ఖాసిమ్ మాట్లాడుతూ.. మురిద్కేలో భారత్ దాడిలో ధ్వంసమైన తమ మర్కజ్ తయ్యిబా శిథిలాలపై నిలబడి ఉన్నానని తెలిపాడు. గతంలో ఈ కేంద్రంలో అనేకమంది ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చామని కూడా అంగీకరించాడు. పాకిస్థానీ యువతను ఉగ్రవాద శిక్షణలో భాగం కావాలని పిలుపునిచ్చాడు. మరో వీడియోలో లష్కరే డిప్యూటీ చీఫ్ సైఫుల్లా కసూరీ మాట్లాడుతూ పాక్ ప్రభుత్వం , సైన్యం తమ ఉగ్ర శిబిరాల పునర్నిర్మాణానికి నిధులు అందిస్తున్నాయని బహిరంగంగా ఒప్పుకున్నాడు. ఇది పాక్ అబద్ధాలకు, ఉగ్రవాదానికి మద్దతునిస్తున్న నిజానికి స్పష్టమైన రుజువు. లి ఆపరేషన్ సిందూర్.. భారత్ దళాల ప్రతీకారం "ఆపరేషన్ సిందూర్"లో మొత్తం తొమ్మిది కీలక ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయని నిఘా సంస్థలు ధృవీకరించాయి. ఈ దాడిలో మురిద్కే క్యాంప్ ప్రధానమైనది. పహల్గాంలో లష్కరే జరిపిన దాడిలో 26 మంది అమాయకులు చనిపోయిన ఘటనకు ప్రతీకారంగానే భారత దళాలు ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. భవిష్యత్ సవాళ్లు లష్కరే తయ్యిబా 2026 ఫిబ్రవరి 5న జరగబోయే "కశ్మీర్ సంఘీభావ దినోత్సవం" కోసం మురిద్కేలో కొత్తగా నిర్మించబోయే కాంప్లెక్స్‌ను వేదికగా మార్చాలని చూస్తోందని భారత నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఇది మరోసారి ఉగ్రవాద శిక్షణ, కార్యకలాపాలకు కేంద్రంగా మారే ప్రమాదం ఉంది. మసూద్ అజర్ కుటుంబానికి నష్టం జైషే మహ్మద్ కమాండర్ ఇలియాస్ కశ్మీరీ కూడా తన ప్రసంగంలో ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజర్ కుటుంబం తీవ్ర నష్టం చవిచూసిందని అంగీకరించాడు. ఇది ఈ దాడుల తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఈ పరిణామాలు ఉగ్రవాదంపై భారత్ ఎటువంటి రాజీ లేకుండా పోరాటం చేస్తోందని, పాకిస్థాన్ మాత్రం అబద్ధాల ప్రచారంతో నిజాలను దాచిపెడుతోందని నిరూపిస్తున్నాయి. ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న పాక్ ప్రభుత్వ వైఖరి, కమాండర్ల అంగీకారంతో బట్టబయలైంది.

# విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ



**కొండిపి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** మాతృమూర్తి జ్ఞాప కార్ధంగా విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు అందించి మాతృమూర్తి పై ప్రేమను చాటుకున్నారు దాత. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి కీర్తి శేషులు డాక్టర్ అవ్వారి వెంకటేశ్వర్లు ధర్మపత్ని రతమ్మ జ్ఞాపకా ర్థం కుమారుడు అవ్వారీ సుబ్బారావు కొండపి మండలం దాసిరెడ్డి పాలెం ఎంపీపీస్ విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలలో ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేఖ, ఎంఈఓ 2 రామారావు, స్కూల్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు..

## వారోత్సవాల వల్ల విద్యార్థులలో
# సాంస్కృతిక అభిలాష పెరుగుతుంది

### ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్






**చీడికాడ, ప్రజలకి చేరువ ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలలలో వారోత్సవాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల కు సాంస్కృతిక అభిలాష పెరుగుతుందని ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ అన్నారు. మండలంలోని చుక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హిందూ దివస్ కార్యక్రమాన్ని హిందీ ఉపాధ్యాయులు సుధీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం బివి రమణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కింతలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ పాల్గొన్నారు . దీనిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారుచేసిన బోధనభ్యాస సామాగ్రి, అనేక రకాలు ప్రదర్శించారు. విద్యార్థుల చేసిన హిందీ సాంస్కృతి కార్యక్రమాలు ఆకర్షించాయి. విద్యార్థులకు హిందీ విభాగంలో అనేక అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాలలో జాతీయ దినోత్సవాలు జరుపుకోవడం వల్ల పిల్లలలో సాంస్కృతిక అభిలాష పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తాత్కాలికం వద్దు
# శాశ్వత పరిష్కారం చూపండి



**చీడికాడ, ప్రజలకి చేరువ ప్రతినిధి :** తాత్కాలిక కాజ్వే వల్ల ఉపయోగం లేదని శాశ్వత కాజ్వే నిర్మించాలని టిడిపి నేత భీమరాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని దిబ్బ పాలెం పంచాయితీ శివారు కట్టవాని అగ్రహారం విజయరామరాజుపేట మధ్యలో గల వంతెన ఇటీవల వర్షాలకు వరద నీరు అధికమై కుంగిపోయి శిథిలావస్థకు చేరిందని దీంతో రాకపోకలు నిలిచిపోయాయి అన్నారు. గతంలో 35 లక్షలతో ఈ వంతెన నిర్మించారని అయితే పిల్లర్లు లోతుగా వేయకుండా దిగునా కాంక్రీట్ దిమ్మ వేసి దానిపై పిల్లర్లు వేయడం వల్ల వంతెన కృంగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి అన్నారు. అయితే ఇటీవల అధికారులు 65 లక్షలు కేటాయిస్తున్నామని తాత్కాలిక కాజ్వే నిర్మిస్తామని తెలిపారు అన్నారు. వాస్తవంగా తాత్కాలిక కాజ్వే నిర్మిస్తే మరల వర్షాలు పడి వరదలు అధికమైతే కొట్టుకుపోతాయన్నారు. తాత్కాలిక కాజ్వేకు 65 లక్షలు కేటాయించే బదులు సుమారు కోటి రూపాయల కేటాయించి కోణం జలాసాయ దిగువున నిర్మించిన కాజ్వే ల నిర్మిస్తే నీరు అధికమైతే కాజ్వే పైనుండి పారుతుందని అయినప్పటికీ కాజువెక్కు నష్టం వాటిల్లదన్నారు. సిమెంట్ గొట్టాలు వేసి కాంక్రీట్ తో ఫీల్ చేసి శాశ్వతంగా ఉండే కాజ్వేలా నిర్మించి నట్లయితే అధికవ్యయం జరగకుండా నివారించడమే కాకుండా పూర్తిస్థాయిలో రాకపోకలకు అవకాశం కలుగుతుందన్నారు. నీరు తక్కువగా ఉన్నప్పుడు సిమెంట్ గొట్టాల నుండి పోతుందని, నీరు అధికమై ప్రవాహం అధికంగా వచ్చిన, కాజ్వేపైనుండి పారిన కాజ్వేకు నష్టం వాటిల్లదన్నారు. పూర్తిస్థాయి కాజ్వే నిర్మిస్తే భారీ వాహనాలు రాకుండా ఏర్పాట్లు చేయడం జరుగు తుందని దీంతో చిన్న వాహనాలు ద్విచక్ర వాహనాలు ఆటోలు రాకపోకలకు వీలు కలగడమే కాకుండా ఈ ప్రాంతంలో ఉన్న సుమారు 10 గ్రామాల ప్రజలకు రాకపోకల సమస్య తీరుతుంది అన్నారు. అధికారులు ఈ సమస్యపై పునరాలోచించి శాశ్వత కాజ్వే నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# ఇరిగినేని మరిచిన కనిగిరి

పెద్దాయనకు కనిగిరిలో చిన్న కాంశ్య విగ్రహంకూడలేదు

రాజకీయంగా ఎందరికో ఆదర్శంగా నిలిచిన అపరచాణిక్కుడు

ఓట్లకోసం పెద్దాయన పేరు వాడుకుంటున్న కొందరు నేతలు

కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా సేవలందించిన పెద్దాయన

నేడు మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు జయంతి వేడుకలు

ఇప్పటికైనా కనిగిరి రాజకీయనేతలు ఆయనను గుర్తిస్తారని ఆశిద్దాం

**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి**



దశాబ్దకాలంగా కనిగిరి నియోజకవర్గంలో రాజకీయలలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా సేవలు అందించారు. జిల్లాలో వెనుక బడిన కరువు ప్రాంతంగాచెప్పుకునే కనిగిరికి జిల్లాలో ఒక గుర్తింపు తెచ్చారు. ఆయన పరిధిమేరా అభివృద్ధి చేశారు. దశాబ్దకాలంపాటు రాజకీయాలలో ఉన్న కనిగిరి పట్టణంలో ఉండటానికి సొంతఇండ్లు లేదు అంటే ఇప్పటి జనం నమ్మరేమోమరి. కాని అది మాత్రంనూటికి నూరుపాళ్లునిజం. నిజాయితీకి నిబద్ధతకు నిలువుతద్దమే కనిగిరి మాజీఎమ్మెల్యే స్వర్గీయ ఇరిగినేని తిరుపతినాయుడు. ఆయనను అందరు ఆప్యాయంగా పెద్దాయన అని పిలుస్తారు. ఈయన పేరు నాటి తరం నుండి నేటి తరం కొంత ముందుకి తెలుసు. ఈయన పేద బడుగు వర్గాలవారి అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారని చెప్పాలి. అంతేకాదు ఎంతోమందికి ఒకరంగా రాజకీయ భిక్షపెట్టారని చెప్పాలి. కాని అలాంటి నాయకుడుకి కనిగిరి నియోజకవర్గ కేంద్రంలో కనీసం చిన్న కాంశ్యవిగ్రహంకూడ లేకపోవడం భాదాకరం. ఎన్నికలప్పుడు మాత్రం ఆయన పేరు బాగా వినపడుతుంది. ఎందుకంటే కొందరికి ఆయన పేరు చెబితేనే ఓట్లు పడేది. ఎన్నికలప్పుడు ఆయన పేరువాడుకున్న వారు ఎన్నికల అనంతరం ఆయన పేరు మరిచి పోవడం 2009నుండి పరి పాటిగా మారింది. ఆయన శిస్యులమనే చెప్పుకునే నాటి,నేటి రాజకీయనాయకులు నేడు అయన జన్మదిన సందర్బంగా కాంశ్య విగ్రహం ప్రకటన చేస్తారని ఆశిద్దాం.



## పేదల సంక్షేమమే
# ప్రభుత్వ లక్ష్యం

### టిడిపి నేత భీమరాజు

**చీడికాడ ప్రజలకి చేరువ ప్రతినిధి**

పేదల సంక్షేమానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని టిడిపి నేత భీమరాజు అన్నారు. మండలంలోని దిబ్బపాలెం శివారు కట్టవాని అగ్రహారం గ్రామంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు మండలాలు అభివృద్ధి చెందాలంటే అది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుంద న్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గ్రామస్తులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దద్దాల ఆధ్వర్యంలో మార్కాపురానికి
# భారీగా కదిలిన వైసీపీ శ్రేణులు



**కనిగిరి, ప్రజలకుచేరువ**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపార్టీ పిలుపు మేరకు ఛలో మార్కాపురం కార్యక్రమం జిల్లాలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల వైసిపి శ్రేణులు మార్కాపురం మెడికల్ కాలేజీ దగ్గరకు భారీగా తరలి వెళ్లారు. ఈసందర్భంగా దద్దాలనారాయణ యాదవ్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందరికి ఉచిత ఆరోగ్యం అందించాలనే ఉద్యేశంతో మార్కాపురంలో మెడికల్ కాలేజీ నిర్మించడం జరిందన్నారు. మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేయకుండ నేటి కూటమి ప్రభుత్వమే కాలేజీ పనులు పూర్తి చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆరు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధసంఘాల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిఎంహెచ్ ఓను మర్యాదపూర్వకంగా కలిసిన
# మున్సిపాలిటీ చైర్మన్





**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి**

స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కనిగిరి పట్టణంలోని ఎస్టీ గురుకుల హాస్టల్ను డిఎంహెచ్ ఓ టి.వెంకటేశ్వర్లు తనిఖీలో భాగంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కనిగిరి పట్టణంలో విష జ్వరాలైన డెంగ్యూ టైఫాయిడ్ మలేరియాతో ప్రజలు చాలా బాధపడుతున్నారు. కనిగిరి శివారు ప్రాంతాలైన కాశిరెడ్డి కాలనీ శివనగర్ కాలనీ బొగ్గులు గొంది ప్రాంతాల్లో నివసించే ప్రజలు చాలా పేదరిక ప్రజలు కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పట్టణ ప్రజలను ఆరోగ్యం వంతులుగా చూడాలని కనిగిరి ప్రాంతం చాలా వెనుకబడిన ప్రాంతం కనుక మేరుగైన వైద్య అందిం చ్చాలని కోరగా ఆయన సానుకులంగా స్పందన ప్రత్యేక ఆరోగ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని అయన తెలిపారు.

# వైద్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ తనిఖీ



**పొన్నలూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** మండలంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు అకస్మిత్తంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం మండలం లో జరుగుచున్న స్వస్థ నారీ స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం అమలు జరుగుచున్న తీరును పరిశీలించారు. సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తం గా ఉంటూ గ్రామాల్లో ప్రతీ రోజూ నిర్వహించు చున్న జ్వరాల సర్వే నిర్వహించిన తీరును వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోగనంపాడు గ్రామం లో ఫీవర్ సర్వే జరుగుచున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణ చైతన్య , మల్లికార్జున్ రావుపాల్గొన్నారు.

# కొండిపిలో అంగన్వాడి పోషక మాసోత్సవాలు






**కొండిపి ప్రజలకి చేరువ ప్రతినిధి :** అంగనవాడి పోషక మాసోత్సవాల సందర్భంగా కొండపి అంగన్వాడి కేంద్రాల్లో పోషక మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులకు తండ్రులకు పౌష్టిక ఆహారము వాటి విలువల గురించి సిడిపిఓ సుశీల దేవి వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ రావు, కొండేపి ఉపసర్పంచి కునమునేని వాసంతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ విక్టోరియా రాణి, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైసీపీ నినాదాలతో
# హోరెత్తిన మార్కాపురం

మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చెయ్యోద్ధంటు నినదించిన వైసీపీ నేతలు

తెలుగుదేశం నేతలు కాలేజీని సందర్శించి నిజాలు మాట్లాడాలి

ప్రయివేట్ పరం జీవోలను వెనక్కితీసుకోవాలి..జిల్లా అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి





**మార్కాపురం /పొదిలి ప్రజలకుచేరువ :** చెయ్యొద్దు చెయ్యొద్దు ప్రయివేట్ పరం చెయ్యొద్దు మెడికల్ కాలేజీలను ప్రభుత్వంమే పూర్తి చెయ్యాలని కోరుతూ శుక్రవారం మార్కాపురం పట్టణంలో వైసీపీ శ్రేణులు నినదించారు. రాష్ట్రపార్టీ పిలుపు మేరకు జిల్లాలోని వైసీపీ శ్రేణులు మార్కాపురంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ పనులను పరిశీలిం చారు. మెడికల్ కాలేజీలు నిర్మాణాలు జరగలేదనే తెలుగుదేశం పార్టీ చేస్తున్న ప్రచారాన్ని వారు ఖండించారు. ఈసందర్బంగా జిల్లాపార్టీ అధ్యక్షులు మరియు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లా డుతూ ప్రకాశంజిల్లాలో వెనుకబడ్డప్రాంతమైన మార్కాపురం పరిచశర ప్రాంతాలను అభివృద్ధిచెయ్యడమేకాక ఇక్కడ విద్యను అభివృద్ధి చేసేందుకు గత ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి మార్కాపురంలో మెడికల్ కాలేజీ నిర్మించడం జరిగిందన్నారు. ఎన్నికలు రావడంతో కొంత పనులు ఆగాయని వాటిని ఆసరాగా చేసుకోని అధికారంలోఉన్న కూటమి ప్రభుత్వం ఇక్కడ మెడికల్ కాలేజీ పనులు జరగలేదని విషప్రచారం చేస్తుందని ఆ ప్రచారాన్ని ఖండిస్తున్నామని అని అన్నారు. ప్రైవేట్ పరం చేసేందుకు ఏర్పాటు చేసిన జీవోను ప్రభుత్వం వెంటనే వెనక్కితీసుకోవాలన్నారు. ప్రభుత్వంమే రాష్ట్రములోని మెడికల్ కాలేజీలను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలుగుదేశం నాయకులు మార్కాపురం వచ్చి వస్తావపరిస్థితిలు మాట్లాడాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లాలోని వైసీపీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

# రెండు కేజీల గంజాయి స్వాధీనం

### ఇరువురి అరెస్ట్



**చీమకుర్తి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** నిషేధిత గంజాయి విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసి రెండు కేజీల గంజాయి స్వాదినపరుచు కున్నట్లు ఒంగోలు రూరల్ ఇన్స్పెక్టర్ ఎన్ శ్రీకాంత్ బాబు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిపాడు మండలం వెల్లంపల్లి గ్రామం లో గంజా అమ్ముతున్నారని సమాచారం మేరకు ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ శ్రీకాంత్ బాబు, మద్దిపాడు ఎస్ఐ జి వెంకట సైదులు సిబ్బందితో కలిసి జరిపిన దాడుల్లో వెల్లంపల్లి వద్ద ఆవాస్ హోటల్ కి ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కన చీమకుర్తి మండలం మరి చెట్ల పాలెం గ్రామానికి చెందిన బండారి ఎస్తేరమ్మ, ఒరిస్సా కు చెందిన దీప కుమార్ మాలిక్ లు ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని రెండు కేజీలు తీసుకువచ్చి వెల్లంపల్లి , ఆ పరిసర గ్రామాలలో అమ్ముతూ జీవించుచున్నట్లుగా తెలిసి వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని వారి ఇరువురిని మద్దిపాడు తాహసిల్దార్ సమక్షంలో ఒంగోలు రూరల్ సీఐ యన్ .శ్రీకాంత్ బాబు అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని శనివారం జ్యూడిషియల్ రిమాండ్ కి తరలిస్తున్నట్లు తెలిపారు.

## కర్ణాటకలో బైక్ ట్యాక్సీ సేవలు రద్దు




**బెంగళూరు :** కర్ణాటక హైకోర్టు శుక్రవారం ఇచ్చిన ఆదేశాలతో ఆ రాష్ట్రంలో బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం నుంచి ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థలు తమ సేవలను నిలిపివేశాయి. హైకోర్టు ఆదేశాలతో తమ సేవలను నిలిపివేస్తున్నట్లు ర్యాపిడో వెల్లడించింది. సేవలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామని పేర్కొంది. బైక్ ట్యాక్సీ సేవలను ఉబర్ మోటో కొరియర్ కింద మార్చింది. మరో అగ్రిగేటర్ ఓలా తన యాప్‌లో బైక్ ట్యాక్సీ ఆప్షన్‌ను తొలగించింది. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటే కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయడంతో డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. జూన్ 20లోగా దీనిపై తమ స్పందన తెలుపాలని కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 24కు వాయిదా వేయగా.. తాత్కాలికంగా బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. దీంతో గిగా వర్కర్లు తమ ఉపాధిని కోల్పోయారు.

## సాంకేతిక సమస్యతో లక్నోలో సౌదీ విమానం ల్యాండ్



**లక్నో :** సౌదీ అరేబియా నుండి హజ్ యాత్రికులు సహా 250మంది ప్రయాణికులతో వెళుతున్న విమానం సాంకేతిక సమస్య కారణంగా ఆదివారం లక్నోలో ల్యాండ్ అయింది. విమానం ల్యాండ్ అయ్యే సమయంలో ఎడమ టైర్ నుండి పొగలు వెలువడినట్లు అధికారులు తెలిపారు. హైడ్రాలిక్ వ్యవస్థలో లోపం కారణంగా టైర్‌లో లోపం ఏర్పడివుండవచ్చని అన్నారు.
వివరాల ప్రకారం.. ఎయిర్ బస్ ఎ330-343 విమానం జెడ్డాలో రాత్రి 10.45 గంటలకు బయలుదేరి ఉదయం 6.50 గంటలకు లక్నోలోని అమౌసీ విమానాశ్రయంలో దిగింది. రన్‌వేపై దిగిన తర్వాత టాక్సీవే పైకి వస్తుండగా ఎడమ టైర్ నుండి నిప్పురవ్వలు, దట్టమైన పొగలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన పైలెట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారం అందించారు. సిబ్బంది 20నిమిషాల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విమానం రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో ఎడమ టైర్ పనిచేయకపోవడంతో మంటలు వచ్చినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని అన్నారు. మరో ఘటనలో ఆదివారం హైదరాబాద్ వెళుతున్న లుఫ్తాన్స విమానం బాంబు బెదిరింపులతో ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలో దిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం..మధ్యాహ్నం 2.14గంటలకు జర్మన్ నుండి బయలుదేరిన బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లో ల్యాండ్ అయ్యేందుకు అనుమతి లభించకపోవడంతో వెనక్కు మళ్లినట్లు లుఫ్తాన్స వార్తా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విమానం సోమవారం తెల్లవారుజామున రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సి వుంది.

## కేరళ పెయింట్ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం



**చలక్కుడి:** కేరళలో ఉత్తర చలక్కుడిలోని పెయింట్ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, స్థానికులు మంటలను ఆర్పడానికి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. మంటలను ఇంకా అదుపులోకి రాలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం గోడౌన్ వెనుక నుండి ప్రారంభమైన మంటలు ఇప్పుడు ముందు వైపుకు వ్యాపిస్తున్నాయి. చలక్కుడి నుండి రెండు యూనిట్ల అగ్నిమాపక సిబ్బంది వచ్చి ప్రారంభ దశలో మంటలను ఆర్పడానికి ప్రయత్నాలు చేశారు. అనంతరం ఇరింజలకుడ, పుతుక్కాడ్ నుండి మరిన్ని అగ్నిమాపక దళాల బృందాలు వచ్చాయి. గోడౌన్ పక్కన గ్యాస్ గోడౌన్ ఉండటం కూడా ఆందోళన కరంగా ఉంది. గోడౌన్ నుండి గ్యాస్‌ను తొలగిస్తున్నారు.

# భారత ఆర్థిక వ్యవస్థపై పెను భారం

### ద్రవ్యోల్బణం, వాణిజ్యం పైనా ప్రభావం.. తప్పని చమురు ధరల మంటలు.. పశ్చిమాసియా ఘర్షణలపై నిపుణుల హెచ్చరిక



ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలు భారత ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణం, వాణిజ్యంపై ప్రభావం చూపబోతున్నాయి. చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయని నిపుణులు హెచ్చరించారు. అంతర్జాతీయ వాణిజ్యం స్థిరంగా ఉన్న సమయంలో, ఎర్ర సముద్రంలో నౌకల రాకపోకలు సాధారణ స్థాయికి చేరుకున్న వేళ పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఫలితంగా వాణిజ్య కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని, చమురు ధరలు భగ్గుమంటాయని ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న ఆందోళన కారణంగా సెన్సెక్స్ 573 పాయింట్లు పతనమైంది. హోర్మజ్ జలసంధిని ఇరాన్ మూసివేయవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఈ జలసంధి మీదుగానే ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుండి 20 నుండి 25 శాతం అంతర్జాతీయ చమురు, కీలకమైన ఎల్‌ఎన్‌జీ రవాణా జరుగుతోంది. మన ఇంధన అవసరాలకు ఈ రెండూ ముఖ్యమైనవే.

**అస్థిరత తప్పదు :** ఇజ్రాయిల్-ఇరాన్ ఘర్షణల కారణంగా అస్థిరత నెలకొనే ప్రమాదం కూడా ఉంది. రాబోయే నెలలలో ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అంతేకాదు%ొ%దేశానికి స్థూల ఆర్థిక సవాళ్లు కూడా ఎదురవుతాయి. చమురు దిగుమతులపై భారత్ ఎక్కువగా ఆధారపడుతున్నందున ఈ పరిస్థితి తప్పకపోవచ్చు. బ్యారల్ ముడిచమురు ధర పది డాలర్లు పెరిగితే మన వాస్తవ జీడీపీ వృద్ధి 0.3 శాతం పాయింట్లు తగ్గిపోతుంది. అలాగే వినియోగ ద్రవ్యోల్బణం 0.4 పాయింట్లు పెరుగుతుంది. 75 నెలల కనిష్ట స్థాయి నుండి ద్రవ్యోల్బణం కొంతమేర కోలుకొని మేలో 2.82 శాతానికి చేరింది. దీంతో ఆర్‌బీఐ రెపో రేటును 50 బేసిక్ పాయింట్లు తగ్గించింది. ద్రవ్యోల్బణ పరిస్థితుల నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పరిస్థితులలో ఇరాన్-ఇజ్రాయిల్ ఘర్షణల కారణంగా మళ్లీ ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం కన్పిస్తోంది. చమురు ధరలు పెరిగితే మన రిఫైనింగ్ కంపెనీలు ముడి చమురును కొనుగోలు చేయడానికి ఎక్కువ డాలర్లు వెచ్చించాల్సి వస్తుంది. దీంతో డాలర్ డిమాండ్ పెరుగుతుంది. రూపాయి బలహీనపడుతుంది. దిగుమతి వ్యయం పెరుగుతుంది. ఈ పరిణామాల ఫలితంగా భారత ప్రస్తుత కరంట్ అకౌంట్ లోటు పరిస్థితి దారుణంగా మారుతుంది.

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దెబ్బే :** ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలు ఇప్పటి వరకూ నేరుగా దాడులు చేయలేదు. అయితే ఆ ప్రమాదం కూడా పొంచి ఉంది. తన రిఫైనరీలకు ఎలాంటి నష్టం కలగలేదని ఇరాన్ తెలిపింది. ఇరాన్ రిఫైనరీలు రోజుకు 2.8 మిలియన్ బ్యారల్స్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే దాని ముడి చమురు ఎగుమతులు రోజుకు 1.5 మిలియన్ బ్యారల్స్ కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉంది. దీనివల్ల ప్రపంచ ఇంధన మార్కెట్లలో మరింత అస్థిరత నెలకొంటుంది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణలతో ముడి చమురు ధరలు మాత్రమే కాకుండా భారత్ దిగుమతి చేసుకునే ఎల్‌పీజీ, సహజ వాయువు, పెట్రోకెమికల్స్, ఎరువుల ధరలు కూడా పెరుగుతాయి. వీటి సరఫరాలో అడ్డంకులు ఏర్పడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఎరువుల ధరలు పెరిగితే ఆహార ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది.


**లాభాలలో కోత :** ఎరువులు, ఎల్‌పీజీ ధరలు పెరిగిన పక్షంలో గ్రామీణ కుటుంబాలపై భారం పడుతుంది. వ్యవసాయోత్పత్తి పడిపోతుంది. ఆహార ధరల స్థిరత్వం విషయంలో ఇటీవల సాధించిన సత్ఫలితాలు కనుమరుగై ద్రవ్యోల్బణం పైకి ఎగబాకుతుంది. విమానయానం, రసాయనాలు, రంగులు, టైర్లు, సిమెంట్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాలు ఎక్కువగా పెట్రోలియం ఆధారిత ఇన్‌పుట్స్‌పై ఆధారపడతాయి. ముడి పదార్థాల ఖర్చులు పెరిగితే ఈ రంగాల లాభాల మార్జిన్లు తగ్గిపోతాయి. చమురుపై ఆధారపడడాన్ని బట్టి వివిధ రంగాలపై ప్రభావం భిన్నంగా ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ హెచ్చరించింది. ముడి చమురు ధరలు పెరిగితే చమురు కంపెనీలు లాభపడతాయి. రిఫైనరీల మార్జిన్లు తగ్గుతాయి. ప్యాకేజింగ్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, రంగులు, ప్రత్యేక రసాయనాలు సహా పరిశ్రమలకు ముడి చమురుతో పరోక్ష సంబంధం ఉంటుంది. ముడి చమురు ధరలు పెరిగితే ఆయా కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల పైనే వేస్తాయి. దీనివల్ల డిమాండ్ లేదా లాభంపై ప్రభావం పడుతుంది. ఉద్రిక్తతలు పెరిగితే రవాణా ఛార్జీలు, లాజిస్టిక్ ఖర్చులు కూడా పెరిగిపోతాయి. కిరాణా సరుకుల సరఫరాలకు విఘాతం కలగడంతో ఎంఎస్ఎంఈల ఖర్చులు పెరుగుతాయి. ఈ వ్యాపారాలన్నింటికీ ఇన్‌పుట్ ఖర్చులు పెరగడం, డిమాండ్ పెరగకపోవడం వల్ల మార్జిన్లు తగ్గిపోతాయి.

**బంగారం ధర కూడా :** %పశ్చిమాసియా ఘర్షణల కారణంగా దేశంలో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. రూపాయి బలహీనపడడం, సురక్షిత ఆస్తుల వైపు మదుపుదారులు దృష్టి సారించడంతో ఇప్పటికే పది గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలు దాటింది. పెట్టుబడి డిమాండ్ బలంగానే ఉన్నప్పటికీ ధరల పెరుగుదల కారణంగా రిటైల్ ఆభరణాలకు డిమాండ్ మాత్రం అలాగే ఉంది.

**సముద్ర రవాణా భారమే :** మేలో ఎర్ర సముద్రంలో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో నౌకాయానం మామూలుగానే జరిగింది. అయితే పశ్చిమాసియాలో తాజా ఘర్షణల కారణంగా వ్యాపారులలో ఆందోళన పెరుగుతోంది. భారత్ తన ముడి చమురు అవసరాలలో 80 శాతానికి పైగా దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల స్థూల ఆర్థిక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకలు కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గాన్ని ఎంచుకుంటే దూరం పెరుగుతుంది. దాంతో పాటే రవాణా ఛార్జీలు కూడా అధికమవుతాయి. ప్రయాణ సమయం 10-14 రోజులు పెరిగే అవకాశం ఉంది. నౌకల లభ్యత కూడా తగ్గిపోతుంది. ఫలితంగా రవాణా, బీమా ఛార్జీలు పెరిగిపోతాయి. 2022లో సూయజ్ కాలువ ద్వారా 34.94 మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ రవాణా జరిగింది.

# టూరిజం.. టూరిస్క్?

### పర్యాటక ప్రాంతాల్లో ఒకే రోజు మూడు ప్రమాదాలు



పర్యాటక రంగం నుండి కాసులు పిండుకోవాలన్న తపన తప్ప కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు టూరిస్టుల భద్రత పట్టడం లేదా? పర్యాటక ప్రాంతాల వద్ద కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయా? ఫలితంగా పర్యాటకం టూరిస్టులకు టూ 'రిస్క్'గా మారుతోందా? ఆదివారం నాడు చోటుచేసుకున్న మూడు సంఘటనలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాల వైఫల్యం సెలవు దినం కావడంతో కుటుంబ సభ్యులతోనూ, స్నేహితులతోనూ కలిసి ఉల్లాసంగా గడపడానికి వచ్చిన పర్యాటకులకు మూడు రాష్ట్రాల్లో తీరని విషాదం మిగిల్చింది!

**నదిలో కూలిన వంతెన .. నలుగురు మృతి.. 32 మంది గల్లంతు**
మహారాష్ట్రలోని పూణెలో ఇంద్రాయణి నదిపై ఉన్న ఒక వంతెన కూలడంతో నలుగురు మృతి చెందారు. పలువురు గల్లంతయ్యారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇంద్రాయణి నది ఉధృతంగా పారుతోంది. దీంతో గల్లంతైనవారు ప్రాణాలతో బయట పడటంపై అనుమానాలు నెలకొన్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్నాయి. సహాయక బృందాలు అతి కష్టంమీద ఆరుగురిని మాత్రమే కాపాడ గలిగాయి. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. నదీ తీరప్రాంతమంతా బంధువుల, సన్నిహితుల ఆర్తనాదాలతో మారుమ్రోగుతోంది.


**నిర్లక్ష్యమే కారణం :** ఈ ప్రాంతానికి సెలవు దినాల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తూ ఉంటారు. నిజానికి ఈనది పైన వంతెన పాతపడిపోయింది. స్థానికంగా రాకపోకలకు ఉపయోగించడం లేదని చెబుతున్నారు. అయితే, దానికి సంబంధించిన ఎటువంటి హెచ్చరిక బోర్డులు అక్కడ లేవు. వంతెన మీదకు పోతున్న పర్యాటకులను వారించే సిబ్బంది కూడా లేరు. అనుకోని ప్రమాదం జరిగితే తక్షణమే స్పందించడానికి ఎటువంటి వ్యవస్థలు అక్కడ లేవు. తాజాగా వేసవి సెలవుల నేపథ్యంలో చివరి ఆదివారం కావడంతో ఈ ప్రాంతానికి పర్యాటకులు పోటెత్తారు. అక్కడున్న పాత ఇనుప వంతెనటట నదీ అందాలను చూద్దామని జనం ఒకేసారి పోటీపడ్డారు. వీరిని క్రమబద్ధీకరించే యంత్రాంగం అక్కడ లేకపోవడంతో వంతెన ఒక్కసారిగా కూలిపోయిందని చెబుతున్నారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా%ొ% మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఫోన్‌లో ఆరా తీశారు. ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే ఒకరు వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమేనని, ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు వందమంది ఉన్నారని, అందులో అనేకమంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని ఆయన చెప్పారు.

**హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి :** గౌరీకుండ్ : దేశంలో ప్రఖ్యాతి గాంచిన కేదార్‌నాథ్ పర్యాటక క్షేత్రం సమీపంలో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక చిన్నారి సహా ఏడుగురు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఆర్యన్ ఏవియేషన్‌కు చెందిన హెలి కాప్టర్ గుప్తకాశీ నుంచి పర్యాటకులను కేదార్‌నాథ్ తీసుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం ఉదయం హెలికాప్టర్ 5.20 నిమిషాలకు కేదార్ నాథ్ నుంచి పర్యాటకులతో గుప్తకాశీ బయల్దేరిన హెలికాప్టర్ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో 10 నిమిషాలకే కూలిపోయింది.

**తనిఖీలు లేవు :** ఈ ప్రమాదానికి కూడా నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. వాస్తవానికి సరైన వాతావరణం లేకపోవడంతో గగనతల పర్యాటకంపై స్థానికంగా నిషేధం విధించారు. ఏవియేషన్ సంస్థలు దానిని పట్టించుకోవడం లేదు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించే సంస్థలపై చర్యలు తీసుకునే యంత్రాంగం లేకపోవడంతో ఏవియేషన్ సంస్థలు ఆడింది ఆటగా సాగుతోంది. ప్రమాదం జరిగిన తరువాత అన్ని రకాల హెలికాప్టర్ సర్వీసులను నిలిపివేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు. మే రెండవ తేదీన కేదార్‌నాథ్ గుడిని సందర్శకుల కోసం తెరిచారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఐదు హెలికాప్టర్ ప్రమాదాలు జరిగాయి. వరుసగా జరుగుతున్న ప్రమాదాలే నిర్లక్ష్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

**బాసర వద్ద ఐదుగురు మృతి**
తెలంగాణలోని నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరిలో మునిగి ఐదుగురు యువకులు మృతి చెందారు. హైదరాబాద్ నగరంలోని చింతల్ ప్రాంతానికి చెందిన సన్నిహిత కుటుంబాలకు చెందిన వీరంతా ఆదివారం కావడంతో బాసర వచ్చారు. అనూహ్యంగా జరిగిన ఈ సంఘటనతో వారి రోదనలతో ఈ ప్రాంతం మారుమ్రోగింది.

**భద్రతా సిబ్బంది లేరు :** %బాసరకు తెలుగురాష్ట్రాలోపాటు పొరుగున ఉన్న రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే సంగతి తెలిసిందే. ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నా గోదావరిలో స్నానాలు నియంత్రించ డానికి ఒక వ్యవస్థగాని, కనీస సిబ్బంది గాని లేరు. అక్కడ బోటింగ్ నిర్వహించే యాజమాన్యాలు కనీస భద్రతా చర్యలు పాటించడం లేదు. తాజా ఘటనలో యువకులు ఒడ్డున స్నానం చేయకుం డా, నది మధ్యలో దీవిలాగా ఉన్న ప్రాంతానికి బోట్లలో వెళ్లి నదిలోకి దిగారు. బోటింగ్ సిబ్బంది వీరిని వారించే ప్రయత్నం చేయలేదని చెబుతు న్నారు. దిగిన కాసేపటికే రాకేష్ (17), వినోద్ (18), రితిక్ (18), భరత్, మదన్ (17) గోదావరి ఉధృతికి కొట్టుకుపోయారు. కళ్లముందే వీరి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



# కరుణించని కేంద్రం

### కాసులకు తప్పని కటకట

కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. గతేడాది జూన్లో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన నాటికి భారీ లోటుతోనే ఖజానా స్వాగతం పలికింది. బిజెపి నేతృత్వంలోని ఎన్డీఎలో భాగస్వామిగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తగ్గుతూనే ఉన్నాయి 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్లు రూపంలో రు.30,333 కోట్లు రావాల్సి ఉండగా, కేవలం రు. 20 వేల కోట్లు మాత్రమే చేతికందాయి. అంటే 66 శాతం మాత్రమే రావడం గమనార్హం. కేంద్రం నుంచి ఈ ఏడాది గ్రాంట్లు రూపంలో 32,284 కోట్లు వస్తాయని అంచనాకు వచ్చారు. అంతే తొలి నెల ఏప్రిల్లో కేవలం 316 కోట్లు మాత్రమే రాగా, మే నెల్లో సైతం ఆ మాదిరిగానే నిధులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కేంద్ర పన్నుల్లో వాటా నిధులు కూడా ఏడాది మొత్తానికి 57,566 కోట్లు రావాల్సి ఉంటుందని అంచనా వేయగా, తొలి రెండు నెల్లో నామమాత్రంగానే వచ్చినట్లు తెలిసింది. రెండు నెలలు కలిపి ఎనిమిది వేల వరకు మాత్రమే ఉన్నట్లు తెలిసింది. దీంతో సొంత ఆదాయం పెరగక%ొ% కేంద్రం నుండి నిధులు అందక ఖజానాకు ఇబ్బందులకు గురవుతోంది. ఆదాయం కన్నావ్యయం పెరిగిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ యంత్రాంగం చిక్కకుంది. కేవలం తప్పనిసరి వ్యయం (కమిటెడ్ ఎక్స్పెండిచర్) కు తప్ప మిగిలిన వాటికి నిధులు సర్దుబాటు చేయలేక అనునిత్యం ప్రభుత్వం ఇబ్బందులు పడుతూనే ఉంది. స్థూలంగా చెప్పాలంటే ఖర్చులకు అప్పు చేయనిదే రోజు గడవని పరిస్థితి రాష్ట్రానిది.

**రాష్ట్ర ఆదాయం ఇలా :** ఇక రాష్ట్ర ఆదాయం విషయంలోనూ కష్టాలు తప్పడం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో చంద్రబాబు పాలన వచ్చేసరికి మూడు నెలల ఆర్థిక సంవత్సరం ముగిసిపోగా, సొంత పన్నులు కేంద్ర నిధులు ద్వారా వచ్చిన ఆదాయం కేవలం రు.34 వేల కోట్లే. ఇతర ఆదాయం కలుపుకొంటే మొత్తం జూన్ వరకు ఆదాయం రు66 వేలకోట్లు. ఇందులో 32 వేల కోట్లు రుణాలుగా సేకరించిదే కావడం విశేషం. మొత్తం ఏడాదికి 2.94 లక్షల కోట్లు ఆదాయం అంచగా, చివరకు 20 వేల కోట్లు తక్కువగా వచ్చినట్లు తేలింది. కేంద్రం నుంచి రావాల్సిన దాని కన్నా ఎనిమిది వేల కోట్లు తక్కువగా వచ్చాయి

PRINTED,PUBLISHED AND OWNED BY NARALA MURALI PRINTED AT SUNDAY PRINTING PRESS, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006.
AND PUBLISHED FROM H NO. 5-212-4, KOTTURU , KANIGIRI, PRAKASAM, ANDHRA PRADESH - 523230 RNI NO : APTEL 2020/80178. CELL : +91 891 934 5606 EDITOR : KUMAR